క్లుప్తంగా

వివాదాస్పద స్థలంలో రోడ్డు నిర్మాణం వద్దు



కార్పొరేషన్ చేపట్టిన రోడ్డు నిర్మాణం ఇదే

ఏలూరు (టూటౌన్): వివాదస్పద స్థలంలో రోడ్డు నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని స్థానిక 24వ డివిజన్ విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన వ్యక్తి మీసాల శ్రీనివాస రావు కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ, మరో పక్క పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు విచారణలో ఉండగా నగరపాలక సంస్థ అధికారులు ఏకపక్షంగా ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం దారుణమని పేర్కొన్నారు. వివాదస్పద డీటీసీపీ లేఅవుట్‌లో 33 అడుగుల రోడ్డు విషయమై జిల్లా కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. అక్రమంగా రోడ్డు నిర్మించేందుకు ఈ నెల 6, 7 తేదీల్లో మార్కింగ్ చేసి నల్ల కంకర తోలారని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళలు, బాలికల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు సూచించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం – టోల్ ఫ్రీ నెంబర్లపై ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఆయన శక్తి టీమ్ సభ్యులతో కలిసి అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం ఉన్న చట్టాలతో పాటు 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ మోసాల నివేదికల కోసం), 1098 (బాలల హెల్ప్‌లైన్), 181 (మహిళల హెల్ప్ లైన్), 1073 (ట్రాఫిక్ సమాచారం), 101 (ఫైర్ ఎమర్జెన్సీ) వంటి కీలకమైన టోల్ – ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు.

సేవా రంగంలో కృష్ణకు డాక్టరేట్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఇందిరా కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (సోషల్) గుగ్గులోతు కృష్ణ మాస్టారుకు సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. సామాజిక సేవా రంగంలో ఆయన చేస్తున్న విశేష కృషిని గుర్తించి ఈ నెల 28న డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్టు ఆసియా అంతర్జాతీయ సంస్కృతి పరిశోధన విశ్వవిద్యాలయం ప్రతినిధులు తెలిపారు.

నగర వీధుల్లో చెత్త స్వాగతం

- జిల్లా కేంద్రం ఏలూరులో దుర్గంధం
- స్వచ్ఛాంధ్ర.. కార్యక్రమాలకే పరిమితం
- అనారోగ్యం అంటున్నా స్పందించని అధికారులు



ఏలురులోని నరసింహరావు పేటలోని ఓ వీధిలో ఉన్న చెత్త కుప్ప

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లా కేంద్రమైన ఏలూరు నగర వీధుల్లో చెత్త కుప్పలు స్వాగతం పలుకుతున్నాయి. కొన్ని వీధుల్లో ఆసుపత్రులు, మరికొన్ని ప్రాంతాల్లో హోటళ్లు, చిరుతిళ్ల బండ్ల నుంచి వచ్చే వ్యర్థాలను అక్కడికక్కడే పడేస్తుండడంతో సమస్య మరింత అధికంగా ఉంటోంది. నగరంలోని దాదాపు ప్రతి పేట, ప్రతి వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

క్లాప్ ఆటోల నిలిపివేతతో సమస్య

గతంలో క్లాప్ ఆటోల ద్వారా ప్రతి నిత్యం ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించుకుని తీసుకెళ్లేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్లాప్ ఆటోలను నిలిపివేయడంతో చెత్త సమస్య ఎక్కువైంది. ప్రజలు తమ ఇంటిలోని చెత్తను తమ వీధిలో ఖాళీ ప్రదేశంలో పారవేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు రెండు లేదా మూడు రోజులకో ఒకసారి వచ్చి గృహాల నుంచి చెత్త సేకరిస్తున్నారు. అలా సేకరించిన చెత్తను ఆయా వీధుల్లోనే ఒక చోట గుట్టగా వేసి ఉంచుతున్నారు. తరువాత ఎప్పుడో ఒక ట్రాక్టర్ వచ్చి దానిని తీసుకువెళుతోంది. ఇలా ఆయా ప్రాంతాల్లో ఏర్పడిన చెత్త కుప్పల్లో ఆవులు, పందులు సంచరిస్తున్నాయి. చెత్తను చెల్లాచెదురు చేస్తూ రోడ్లపైకి చేరేలా చేస్తున్నాయి. ఈ చెత్త కుప్పను పందులు డ్రెయినేజీల్లోకి తోసివేస్తూ ఉండడంతో మురుగు నీరు పారుదలకు ఆటంకంగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చెత్తలో ప్లాస్టిక్ కవర్లు తీనడం వల్ల ఆవులు అనారోగ్యం పాలవుతున్నాయి.

ఫలించని కార్యక్రమాలు

ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర పేరుతో నగరంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ మేయర్, నగర కమిషనర్, ఇతర అధికారులు పాల్గొంటూ ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞలు చేయించి మమ అనిపిస్తున్నారు. నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి వినియోగించే డబ్బులను పారిశుద్ధ్య నిర్వహణకు ఖర్చు పెడితే కొంతలోకొంత మెరుగుపడుతుందని ప్రజలు సూచిస్తున్నారు.

దుర్గంధంతో ఇబ్బందులు

ప్రతి వీధిలో పేరుకుపోయిన చెత్త నుంచి దుర్గంధం వెదజల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త కుళ్లిపోయి పురుగులు పడుతూ ఇళ్లలోకి చేరుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క దుర్గంధం వెదజల్లుతూ మరో పక్క దోమలు, ఇతర క్రిమికీటకాల ఉత్పత్తి కేంద్రాలుగా ఈ ప్రాంతాలు తయారవుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే వర్షాలు కురుస్తూ నగరంలో రోడ్లన్నీ నీట మునిగి చెత్త కుప్పలు తడిచి మరింత దుర్గంధం వెదజల్లుతున్నాయి. సమస్యను అధికారులు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు ఉండడంలేదని, చెత్తను తొలగించే చర్యలు నామమాత్రంగా చేపడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుప్పలు కుప్పలుగా చెత్త



మా ప్రాంతంలో చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోతోంది. పారిశుద్ధ్య సిబ్బంది రెండు రోజులకో మూడు రోజులకో ఒక సారి వచ్చి తీసుకువెళుతున్నారు. వారు వచ్చి తీసుకువెళ్లడం ఆలస్యమవుతోందని కొందరు వీధిలో ఎక్కడో ఒక చోట చెత్తను వేసేస్తున్నారు. తరువాత ఎప్పుడో అక్కడి నుంచి తీసుకువెళుతున్నా, ఈ లోపు అక్కడ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం.

– బి.నాగరాజు, స్థానికుడు

అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం



వేసవికాలం పూర్తిగా ముగియకముందే వానలు కురుస్తున్నందున ఇప్పటికే ప్రజలు జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. పూర్తిగా సీజన్ మారితే మరింతగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రతి గృహం నుంచి చెత్తను సేకరించి స్వచ్ఛభారత్‌ను అమలు చేయాలి. చెత్త పన్నును రద్దు చేసి చెత్త సేకరించకపోవడం ద్వారా ప్రజలకు ఏమి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు.

– చలమల సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు

దళితులపై పెరిగిపోతున్న దాడులు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రోజురోజుకు దళితులపై కుల వివక్ష దాడులు పెరిగిపోతున్నాయని కేవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవీపీఎస్, దళిత ప్రజా ఎస్సీ ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో స్థానికంగా గురువారం నిర్వహించి రౌండ్ టేబుల్ సమావేశానికి ఏఐడీఆర్ఎఫ్ రాష్ట్ర నాయకురాలు ఆర్ మణిసింగ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో 2014 నుంచి బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై కుల వివక్ష దాడులు పెరిగిపోయాయన్నారు. హైదరాబాద్ యూనివర్సిటీలో రోహిత్ కుల హత్య, ఇటీవల తిరుమల తిరుపతిలో బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థి జేమ్స్‌పై దాడి ఘటనలను గుర్తుచేశారు. జేమ్స్‌ను కులం పేరుతో దూషిస్తూ అత్యంత దుర్మార్గంగా దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల వ్యతిరేక ప్రభుత్వంగా ఉందని, దళిత ఎస్సీల పట్ల నిర్లక్ష్యం వీడాలని వక్తలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతల రమేష్ బాబు, ఎరికిపాటి విజయ్ కుమార్, మత్తే బాబి, ఎం ఇస్సాక్, కాపుదాసి రవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం



కామ్రేడ్ పర్స చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : నాటి నాయకుల త్యాగ ఫలంగా వచ్చిన విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని సీపీఎం రాష్ట్ర నాయకుడు బి.బలరాం పిలుపునిచ్చారు. గురువారం సీపీఎం స్థానిక కార్యాలయంలో కామ్రేడ్ పర్స సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమం పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన నిర్వహించారు. బలరాం పర్స చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పర్స పార్టీ అగ్రనాయకుల్లో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించిన వారిలో ఒకరని గుర్తుచేశారు. ఆయన 2015 మే 22న ఏలూరులో మరణించారని తెలిపారు. పర్స కొత్తగూడెం ప్రాంతంలో బొగ్గుగని ఉద్యమ కార్మిక నిర్మాణంలో, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ప్రధానమైన పాత్ర పోషించారని, తన శాసన సభ్యత్వాన్ని తృణప్రాయంగా వదులుకున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను నాశనం చేస్తుంటే ఇక్కడి కూటమి ప్రభుత్వం నోరు తెరవకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.మంగరాజు, ఎం నాగమణి, డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్ లింగరాజు, టి.రామకృష్ణ, జి.రాజు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఎం సుధారాణి, ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, ఎస్ హనుమాన్లు, టి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కమిషన్ నూతన చైర్మన్ కేఎస్ జవహర్‌ను కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్, తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి పోలిమేర హరికృష్ణ తెలిపారు. గురువారం స్థానిక గన్ బజార్ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకులతో హరికృష్ణ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, చర్మకార సంఘం నాయకులు కటారి నాగేశ్వరరావు, పోలిమేర దుర్గారావు, రావూరి ప్రతాప్, ఎస్ వెంకటేశ్వరరావు, ఎం శ్రీను, సీహెచ్ వెంకన్న, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమజ్జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, తమలపాకు పూజలు, గంధసింధూర పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణలు చేసి రథోత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధనలు ఏర్పాటుచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి, వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) తదితరులు పాల్గొన్నారు. బెనర్జీ పేట పాండురంగ థియేటర్ వద్ద ఉన్న దాసాంజనేయ స్వామిని జేపీ దర్శించుకున్నారు. శ్రీరామునికి నమ్మిన బంటుగా, కార్యసాధకునిగా, చిరంజీవిగా భక్తులు కొలుచుకునే ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ప్రతినిధి రెళ్ల రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం పోణంగి గ్రామంలో శ్రీ గణపతి, లక్ష్మీ దేవి, సరస్వతి దేవి, శ్రీ భక్తాంజనేయ స్వామి వార్ల ప్రతిష్ఠ కార్యక్రమానికి జేపీ హాజరయ్యారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వామి వారి ప్రసాదం పంపిణీ చేశారు. జేపీ వెంట నాయకులు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, దాసరి రమేష్, గాజుల బాజీ, పతినవలస రాజేష్, దాలి వెంకటేష్, సైదు కొండా, మాచర్ల లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

- దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో శ్రీకార్యసిద్ధి ఆంజనేయ స్వామికి విశేష అభిషేకాలు, అంకరణలు చేశారు. భక్తులు స్వామి ఉత్సవ మూర్తులకు స్వయంగా అభిషేకాలు చేశారు. సాయంతం స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. అర్చకుడు గంటసాల రామకృష్ణ, ప్రతాప కృష్ణ కిషన్షర్ శర్మ విశేష పూజలు చేయగా, క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.
- పవర్‌పేట బడేటి వారి వీధిలోని కోదండ రామాలయంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి 108 మామిడి పండ్లతో అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. అర్చకులడు నారాయణం కోదండ రామాచార్యులు, లక్ష్మణ రంగసాయి ఫణి కుమార్ విశేష పూజలు చేశారు.
- నరసింహరావు పేట, పత్తేబాద, సత్రంపాడు, శాంతినగర్, తంగెళ్లమూడి, కొత్తపేట, ఆదివారపు పేట, ఒన్‌టౌన్‌లోని దక్షిణపు వీధి, తూర్పువీధి, తదితర ప్రాంతాల్లోని శ్రీరామ మందిరాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు.



బెనర్జీపేట శ్రీ దాసాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి జేపీ



స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

హనుమాన్ శోభాయాత్ర

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత రామకోటి ప్రాంగణం వద్ద భారీ హనుమంతుని ప్రతిమను, ప్రత్యేకంగా పూలతో అలంకరించి రథంపై పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శోభయాత్రను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఓల్డ్ మార్కెట్, చందనా బ్రదర్స్ సెంటర్, టూ టౌన్ ఏరియా, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా సాగి రామకోటికి చేరుకుంది. హనుమాన్ భక్తులు జై హనుమాన్, జై జై హనుమాన్ అంటూ కాషాయ జెండాలు చేతపూని నినాదాలు చేశారు. ర్యాలీలో విశ్వహిందూ పరిషత్ నాయకులు కాకి సురేష్, గద్దం నాగరాజు, చొటపల్లి విక్రమ్ కిషోర్, కట్నేని కృష్ణ ప్రసాద్, ప్రాంత వివేకానంద కేంద్ర నిర్వాహకులు సదాశివ, సత్యానందగిరి స్వామీ, నెక్కంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దత్తక్షేత్రంలో కార్యసిద్ధి ఆంజనేయ స్వామి



బడేటి వారి వీధిలోని ఆంజనేయ స్వామి



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



నినాదాలు చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	19
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	13
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	34	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	50
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	20	అల్లం	58
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

21 వరకు యోగా తరగతులు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణా తరగతులు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు నిర్వహించనున్నట్టు ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ భాను ప్రతాప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించే యోగా తరగతులకు ఆసక్తి ఉన్న వారంతా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పోణంగి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వైఎస్ఆర్ కాలనీ, పోణంగి రోడ్డు, వీఎస్ఆర్ గ్రాండ్ సిటీ, రాజరాజేశ్వరి నగర్, శ్రీరామ్ నగర్ కాలనీ, పోణంగి, ఈనమ్మగుంట, జగనన్న కాలనీ, మరడాని రంగారావు కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



ఎంపీడీఓ శ్రీలత

దెందులూరు: సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం యోగాంధ్ర–2025 అమలు చేస్తోందని ఏలూరు ఎంపీడీఓ కె.శ్రీలత అన్నారు. గురువారం ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నెల రోజులు పాటు అన్ని గ్రామాల్లో యోగా కార్యక్రమం చేపట్టామన్నారు. మండలానికి ఇద్దరు మాస్టర్ ట్రైనర్స్ ఉంటారని, సచివాలయానికి ఏడుగురు చొప్పున మండలంలో 200 మంది ఉంటారని తెలిపారు. మారుతోన్న ఆహారపు అలవాట్లు, తీరికలేని జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో యోగా నేర్చుకునేందుకు ఆన్‌లైన్‌ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు.

రేషన్ కార్డు దరఖాస్తులకు సర్వర్ సమస్య

- సచివాలయంలో తప్పని నిరీక్షణ
- అర్హుల ఆవేదన



గ్రామ సచివాలయం

దెందులూరు: రేషన్ కార్డు ఇచ్చేస్తున్నామంటూ హడావుడిగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. సచివాలయాలు దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత సమయంలో కార్డు మంజూరవుతుందంటూ అధికారులు చెబుతున్నా అసలు నమోదు కావడం లేదంటూ దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరీక్షిస్తున్నా సర్వర్ పని చేయడం లేదంటూ సిబ్బంది చెబుతున్నారని వాపోతున్నారు. 10 రోజులుగా ఇదే పరిస్థితి ఉన్న ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంపై మండిపడుతున్నారు.

తప్పని పాట్లు

పేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు ఎంతో కీలకం. ఏ ప్రభుత్వ పథకం వర్తింపజేయాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో వలంటీర్లను సంప్రదిస్తే చాలు సకాలంలో రేషన్ కార్డు ఇంటికి వచ్చేసేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయింది. ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ హామీలు లేదా ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయకుండా కాలయాపన చేసి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది.

సమస్య పరిష్కరించాలి



రేషన్ కార్డు దరఖాస్తు చేయడంలో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. ఈకేవైసీ, ఆధార్‌లో తప్పులు, వయసులో తేడాలు తదితర సమస్యలు వెంటాడుతున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకే సర్వర్లు సక్రమంగా పనిచేస్తున్నాయి.

– డి.ప్రేమ్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



దరఖాస్తు సమయంలో వస్తున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయాల్లో సిబ్బంది సైతం దరఖాస్తులకు సహకరిస్తున్నారు.

– రమేష్, డిప్యూటీ తహసీల్దార్, ఏలూరు

ఇన్‌చార్జుల ఏలుబడి

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలో ఇన్‌చార్జులతోనే పాలన కొనసాగుతోంది. జిల్లా కేంద్రమైన ఏలూరులో అనుసంధానమై ఉన్న ఏలూరు రూరల్ మండలంలోని కీలకమైన ఉద్యోగులు భర్తీ కాలేదు. దీంతో పక్క మండలాల ఉద్యోగులు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఉపాధి ఏపీఓ పోస్టుల్లో ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. ఈ నెలఖరికి ఎంఈఓ ఉద్యోగ విరమణ చేయనున్నారు. కీలకమైన ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించాల్సిన అధికారులు పోస్టుల్లో ఇన్‌చార్జులు కొనసాగితే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండు మండలాల బాధ్యతలతో ఏ మండలానికి అధికారులు పూర్తిస్థాయి న్యాయం చేయలేరని, ఏ మండలంలోనూ సరైన సమయంలో అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు పరిశీలించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ద్వారకాతిరుమల: సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ద్వారకాతిరుమలలోని సచివాలయం–1ను గురువారం ఉదయం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులు, ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈకేవైసీ తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అరగంట పాటు ఆమె సచివాలయంలో తనిఖీలు నిర్వహించారు.